
ప్రజాశక్తి
సోమవారం 15 మే 2023
విజయనగరం



నేడు బాక్సింగ్ జట్టు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం జిల్లా యూత్ బాక్సింగ్ జట్టు ఎంపిక సోమవారం ఉదయం 7 గంటల నుంచి నగరంలోని రాజీవ్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షులు డోల మన్మథకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 2005 నుంచి డిసెంబరు 2006 వరకు జన్మించిన వారు మాత్రమే అర్హులని తెలిపారు. ఎంపికకు హాజరయ్యే వారు పాస్‌పోర్టు సైజు ఫొటో, ఆధార్ కార్డు, వయస్సు ధ్రువీకరణ పత్రాలు తీసుకురావాలని చెప్పారు. ఎంపికైన వారు ఈ నెల 19 నుంచి 21 వరకు విశాఖపట్నంలో జరిగే రాష్ట్ర స్థాయి యూత్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో విజయనగరం జిల్లా జట్టు తరపున పాల్గొంటారని పేర్కొన్నారు.



నిర్మించిన గోకులం షెడ్

గోకులం రైతుల గగ్గోలు

- మినీ గోకులం షెడ్లు రాయితీ సొమ్ము ఇచ్చేనా?
- నిర్మించిన మూడేళ్లు గడిచిన జమ కాని నగదు
- డిడి రూపంలో 10 శాతం లబ్ధిదారుల నుంచి వసూళ్లు
- రూ.30 కోట్ల వరకు బిల్లుల బకాయిలు

ఒక ప్రభుత్వం చేపట్టిన పథకాల బిల్లులను వచ్చే నూతన ప్రభుత్వం చెల్లించే బాధ్యత తీసుకోవాలి.. కానీ ప్రభుత్వాలు మారినా గోకులం లబ్ధిదారుల బిల్లులు మాత్రం రావడం లేదు. గత టిడిపి ప్రభుత్వం చేపట్టిన గోకులం పథకానికి సంబంధించి బిల్లులు వైసిపి అధికారంలోకి నాలుగేళ్లయినా లబ్ధిదారులకు బిల్లులు చెల్లింపులు మాత్రం చేయలేదు. దీంతో గోకులం పథకంలో పశువుల షెడ్లు నిర్మించినా బిల్లు చెల్లింపులు లేక రైతులు పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. జిల్లా వ్యాప్తంగా వేల మంది రైతులు ప్రభుత్వ రాయితీ సొమ్ము కోసం నాలుగేళ్లుగా కళ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు.

ప్రజాశక్తి-రేగిడి

2018 అప్పటి టిడిపి ప్రభుత్వం పశువులకు షెడ్లు నిర్మించడంలో భాగంగా గోకులం పథకాన్ని తీసుకొచ్చింది. రెండు పశువులు ఉన్న రైతులు షెడ్లు నిర్మిస్తే రూ.లక్ష, నాలుగు పశువులకు షెడ్లు నిర్మిస్తే రూ.1.50 లక్షలు, ఆరు అంతకంటే ఎక్కువ పశువులు ఉన్న షెడ్లకు రూ.1.80 లక్షలు ఇవ్వనున్నట్లు ప్రకటించింది. వీటిలో 10 శాతం సొమ్ము డీడీల రూపంలో చెల్లిస్తే 90 శాతం ప్రభుత్వం రాయితీగా ఇస్తుంది. ఉపాధి హామీ ద్వారా పశుసంవర్ధక శాఖ నుంచి లబ్ధిదారులకు బిల్లుల చెల్లింపులు ఉంటాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీంతో జిల్లాలో 6,316 వేలకు పైగా రైతులు దరఖాస్తులు చేసుకున్నారు.. వీటిలో 4,532 వరకు యూనిట్లు ఆమోదం పొందాయి. జిల్లా వ్యాప్తంగా 2,511 వరకు షెడ్లు పూర్తి కాగా, మిగిలినవి వివిధ దశల్లో నిర్మాణాలు జరిగాయి. 2019లో వైసిపి ప్రభుత్వం రావడంతో ఒక్కసారి వీటి ఊసే లేక ఈ పథకం తలకిందులు అయింది. షెడ్ల నిర్మాణం పూర్తి చేసిన రైతులకు ఇవ్వాల్సిన బిల్లు చెల్లింపులు 90 శాతం రాయితీ నగదు నేటికీ అందలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ఈ యూనిట్లకు సంబంధించి రూ.30 కోట్లకు పైగా బకాయిలు ఉన్నట్లు అధికారిక లెక్కల్లో తెలుస్తుంది. 2018లో కొంతమందికి బిల్లులు జమ అయినట్లు రైతులు చెబుతున్నారు. నిర్మాణాలు చేపట్టిన గోకులం షెడ్లకు బిల్లులు చెల్లించాలని, 10 శాతం డిడిల కింద చెల్లించిన వాటినైనా తిరిగి ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

అప్పులు చేసి గోకులం షెడ్ల నిర్మాణాలు

అప్పులు చేసి గోకులం షెడ్లు నిర్మించినట్లు రైతులు చెబుతున్నారు. పశువులకు శాశ్వత ప్రాతిపదికన షెడ్లు ఏర్పడుతుందనే ఉద్దేశంతో ముందుకు వచ్చి పది శాతం డీడీలు కట్టారు. పిల్లర్లతో కూడిన బేస్మెంట్ వేసి, కాంక్రీట్‌తోనే నిర్మించారు. ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీ సొమ్ముకు అదనంగా ఖర్చు చేసిన పరిస్థితి నెలకొంది. 10 శాతం సొమ్ము చెల్లించేందుకు, షెడ్ల నిర్మాణానికి పెద్ద ఎత్తున ఖర్చు చేశారు. అప్పులు చేసి ఈ గోకులం నిర్మాణాలు చేపట్టినా, ప్రభుత్వం మారిన తరువాత నేటి వరకు బిల్లు చెల్లించకపోవడంతో లబ్ధిదారుల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి.

బిల్లులు వెంటనే చెల్లించాలి



గోకులం పథకంలో షెడ్ నిర్మించాం. బిల్లులు చెల్లింపులు కాలేదు. ప్రభుత్వం మారినా ఈ పథకం కొనసాగించకపోవడం విడ్డూరం. ఈ పథకంతో రైతులకు ఎంతో మేలు చేకూరుతుంది. మూగజీవాలకు నీడనిచ్చే ఈ పథకం కొనసాగించి బిల్లులు చెల్లించాలి.

- గుండ కృష్ణ, రేగిడి

10 శాతం డిడి కట్టాం



గోకులం షెడ్ మంజూరైతే 10 శాతం డిడి కట్టాం. నిర్మాణం కూడా చేపట్టాం. ఇంతవరకూ బిల్లులు చెల్లించలేదు. అసలు ఈ ప్రభుత్వం రైతులను పట్టించుకోలేదు. ప్రభుత్వం మారినంత మాత్రాన ఈ పథకం బిల్లులు పక్కన పెట్టడం సమంజసం కాదు. బిల్లులు చెల్లించాలి.

-నారు పట్టాభినాయుడు, సంకిలి

బిల్లులు చెల్లిస్తాం

గోకులం షెడ్ల నిర్మాణాలు చేపట్టడం వాస్తవం. 2018 నుంచి 2020 వరకు బిల్లులు చెల్లించాం. తర్వాత నిర్మించిన వాటికి నిధులు మంజూరు కాలేదు.. నిధులు మంజూరైన వెంటనే లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తాం. కొన్ని మండలాలు పునర్విభజన అయ్యాయి. ఉన్నతాధికారులకు నివేదించి బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకుంటాం.

- వై.వి.రమణ,
పశుసంవర్ధక శాఖ జెడి



జిల్లాలోని ప్రధాన కేంద్రాల్లో ఆదివారం నమోదైన ఉష్ణోగ్రతల వివరాలు

ప్రాంతం	ఉష్ణోగ్రత డిగ్రీలలో
విజయనగరం	39
నెల్లిమర్ల	39
శృంగవరపుకోట	40
గజపతినగరం	41
బొబ్బిలి	41
చీపురుపల్లి	42
రాజాం	42

ఉక్కిరిబిక్కిరి

- జిల్లాలో మండుతున్న ఎండలు
- ఇళ్లకే పరిమితమవుతున్న ప్రజలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలో ఎండలు మండిపోతున్నాయి. బయట ఎండగా ఉందని ఇంట్లోకి వెళ్లి ఫ్యానో, కూలరో వేసుకున్నా ఉపయోగం ఉండటం లేదు. అగ్నికీలల కింద ఉన్నట్టు అనిపిస్తోంది. పైగా నిప్పుల కుంపటిలాగా ఎండలు ఉండటంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. కొద్ది రోజుల నుంచి తీవ్రమైన ఎండ, దానికి ఉక్కపోత తోడు కావడంతో ఇబ్బంది పడుతున్నారు. ఉదయం నుంచే ఉండ వేడిమితో ఉక్కపోత మొదలవుతోంది. జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది.

మే నెలలో ఎండలు ఉండటం సాధారణమే. అయితే ఈసారి ఎండకు తోడు జిల్లా వ్యాప్తంగా ఉక్కపోత తీవ్రంగా ఉండటం ప్రజలు నీరసించిపోతున్నారు. పగలు వాహనదారులు ప్రయాణించలేక చెట్ల కింద సేదతీరుతున్నారు. రోడ్ల పక్కన విక్రయిస్తున్న ముంజులు, నిమ్మరసం, కొబ్బరి బొండాలు, చెరకురసం తాగుతూ ఉపశమనం పొందుతున్నారు. నగరంలో ఎండలు పెరిగిన నేపథ్యంలో శీతల పానీయాలకు గిరాకీ పెరిగింది. సాధారణంగా పగటిపూట మాడు పగిలేలా ఎండ ఉన్నప్పటికీ రాత్రి సమయంలో చల్లని గాలులు వీస్తాయి. ఈసారి అదేంటో కానీ చల్లని గాలుల జాడ కూడా కన్పించడం లేదు. పైగా ఉదయం కంటే రాత్రిళ్లు ఉక్కపోత ఉంటోంది. ఫ్యాన్‌లు వేసినా, కూలర్లు పెట్టినా ఉక్కపోత నుంచి ఉపశమనం లభించడం లేదు. పైగా ఒంటి నుంచి చెమట ధారకడుతుండటంతో ప్రజలు దాహార్తితో అల్లాడిపోతున్నారు. కంటి నిండా నిద్రలేక రాత్రంతా జాగారం చేయాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు.

నేడు వడగాల్పులు

జిల్లాలో 13 మండలాల పరిధిలో సోమవారం వడగాల్పులు వీచే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ విభాగం ప్రజలను హెచ్చరించింది. ఈ మండలాల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని ఒక ప్రకటనలో వెల్లడించింది. వేపాడ మండలంలో 44.4, జామిలో 43, గజపతినగరంలో 42.5, బొండపల్లిలో 42.2, గంట్యాడలో 41.9, మెంటాడలో 40.8, కొత్తవలస, దత్తిరాజేరులో 40.3 చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. వీటితోపాటు ఎల్.కోటలో 39.6, గుర్లలో 39.5, విజయనగరంలో 39.2, రామభద్రపురంలో 38.3, శృంగవరపుకోట మండలంలో 35.8 చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని వెల్లడించింది. ఈ మండలాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

ఆ కూడళ్లపై నిర్లక్ష్యమెందుకో?

ప్రమాదకరంగా ఉన్న ఐరన్ గ్రిల్స్ • ఆందోళన చెందుతున్న వాహనదారులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో అన్ని కూడళ్లను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామని చెబుతున్న నగర పాలకులు... కొన్ని జంక్షన్లపై శీతకన్ను వేస్తున్నారు. కార్పొరేషన్ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న ఎంఆర్ కాలేజీ జంక్షన్‌పై నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. గత టిడిపి పాలకులు ఎంఆర్ కాలేజీ జంక్షన్ వద్ద బుద్ధ విగ్రహం, విద్యుత్తు కాంతులు, వాటర్ ఫౌంటెయిన్ ఏర్పాటు చేసి ఆకర్షణీయంగా తయారు చేశారు. నేడు ఆ జంక్షన్‌లో బుద్ధ విగ్రహం శిథిలమైంది. విగ్రహం ముందు, చుట్టూ ఏర్పాటు చేసిన ఐరన్ గ్యాలరీ మొత్తం పాడై ప్రమాదకరంగా మారింది. నిత్యం అదే మార్గంలో వెళ్తున్న పాలకులు, నగర పాలక సంస్థ అధికారులు సైతం పట్టించుకోకపోవడం నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారింది. నిత్యం అభివృద్ధి జపం చేస్తున్న పాలకులు.. టిడిపి హయాంలో చేశారని నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారో, లేక ఆ జంక్షన్‌ను అభివృద్ధి చేయకూడదని అనుకున్నారో ఏమో గానీ నేడు బుద్ధ విగ్రహం జంక్షన్ నిరాదరణకు గురైందనడంలో సందేహం లేదు. అత్యంత ప్రమాదకరంగా విగ్రహం చుట్టూ ఉన్న ఐరన్ గ్రిల్స్ తయారయ్యాయి.

పాత వెంకటలక్ష్మి జంక్షన్ (ప్రస్తుతం వైఎస్ఆర్ జంక్షన్)లో వైఎస్ఆర్ విగ్రహం చుట్టూ ఉన్న ఐరన్ గ్రిల్స్ ప్రమాదకరంగా ఉన్నాయి. విగ్రహం చుట్టూ ఉన్న ఐరన్ గేట్‌ను కొంతకాలం క్రితం గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో రాడ్లు వంగిపోయాయి. ప్రమాదకరంగా మారాయి. ఐరన్ రాడ్ల పక్కనుంచే వాహనాలు వెళ్తుండటంతో ఎవరికి గుచ్చుకొంటాయనే భయంతో వాహనదారులు వెళ్లాల్సి వస్తుంది. తక్షణమే అధికారులు చర్యలు తీసుకోకపోతే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. నిరాదరణకు గురైన కూడళ్లపై పాలకులు దృష్టిసారించి బాగు చేయాలని పలువురు కోరుతున్నారు.

త్వరలో అభివృద్ధికి శ్రీకారం

బుద్ధ విగ్రహం జంక్షన్, వైఎస్ఆర్ విగ్రహం ఐరన్ గ్రిల్స్ పనులు త్వరలో చేపట్టి, కూడళ్లను అభివృద్ధి చేయాలని ఇప్పటికే నిర్ణయించాం. వైఎస్ఆర్ జంక్షన్‌ను ఆధునీకరించనున్నాం. పాలకవర్గం ఆదేశాల మేరకు త్వరలో ఆ రెండు కూడళ్లను అభివృద్ధి చేస్తాం.

-ఆర్.శ్రీరాములు నాయుడు, కమిషనర్



రోడ్డుపైకి వచ్చిన గ్రిల్స్

ఎపిజిఇఎ కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఎపిజిఇఎ) జిల్లా నూతన కార్యాలయాన్ని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.రామచంద్రరావు, కంది వెంకటరమణ ప్రారంభించారు. అతిథులుగా పింఛనుదారుల సంఘం జిల్లా అధ్యక్షులు పెద్దింటి అప్పారావు, నాయకులు కెవి ప్రసాద్, ఇస్కాన్ కార్యదర్శి సూర్యనారాయణ, యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.రమేష్‌చంద్ర పట్నాయక్, జెఎవిఆర్‌కె ఈశ్వరరావు, బిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు శ్రీకాంత్, ఎక్సైజ్ జిల్లా నాయకులు పి.చిన్నంనాయుడు, పిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు పువ్వల శ్రీనివాసరావు, హాస్టల్ వెల్ఫేర్ జిల్లా అధ్యక్షులు రమాదేవి,తదితర సంఘాల నాయకులు పాల్గొన్నారు. అందరి సహకారంతో జిల్లాలోని అన్ని సంఘాలు ఏకతాటిపై నడవడం ద్వారా రాష్ట్ర నాయకత్వాలకు దిక్సూచిగా నిలిచి ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేద్దామని ఎపిజిఇఎ జిల్లా అధ్యక్షులు పి.రామచంద్రరావు కోరారు. జిల్లా ప్రధానకార్యదర్శి కంది వెంకటరమణ మాట్లాడుతూ జిల్లాలోని ఉద్యోగ, ఉపాధ్యాయులు తమ సమస్యలను వాట్సాప్ ద్వారా గాని, సంఘ కార్యాలయం వద్దకు వచ్చిగాని వచ్చి తెలియజేస్తే పరిష్కరిస్తామని తెలిపారు.

అనంతరం జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర శాఖ ఇచ్చిన పిలుపుమేరకు ఈ నెల 22 నుంచి 31 వరకు తాలూకా కేంద్రాల్లో రిలే నిరాహారదీక్షలు చేపట్టాలని తీర్మానించారు. 22న విజయనగరంలో ప్రారంభించి 31న చీపురుపల్లి తాలూకాలో నిర్వహించేందుకు నిర్ణయించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి యుగంధర్, జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ పి.శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.భూషణరావు, ఉపాధ్యక్షులు చిన్నంనాయుడు, కిరణ్ కుమార్, కోశాధికారి వై.శంకరరావు, సంయుక్త కార్యదర్శులు లోచర్ల శ్రీనివాసరావు, బంగార్రాజు, లెంక సత్తిబాబు, పి.ఇజ్రాయెల్, అర్బన్ కార్యదర్శి సతీష్, గజపతినగరం, నెల్లిమర్ల అధ్యక్షులు సుధాకర్ పట్నాయక్, దొర, కొత్తవలస అసోసియేట్ ప్రెసిడెంట్ తేజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



నూతన కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న రామచంద్రరావు, వెంకటరమణ

బిజెపికి సరైన గుణపాఠం

ప్రజాశక్తి-విజయనగరంకోట

కర్ణాటక ప్రజలు బిజెపికి సరైన గుణపాఠం చెప్పారని ఎపిసిసి మైనార్టీ విభాగం వైస్ చైర్మన్ ఎమ్‌డి హుస్సేన్ షరీఫ్ తెలిపారు. ఆదివారం స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కర్ణాటక ఎన్నికల్లో 15 మంది ముస్లిములు ఎమ్మెల్యేలుగా గెలవడం సంతోషంగా ఉందన్నారు. హిజాబ్ గురించి బిజెపి ప్రభుత్వం చేసిన ఘర్షణలకు, 4 శాతం రిజర్వేషన్ ఎత్తివేస్తానని చెప్పడం వల్ల ప్రజలు కాషాయ పార్టీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పారని తెలిపారు. మతతత్వ పార్టీని, మోడీ, అమిత్‌షాను ప్రజలు కర్ణాటక నుంచి తరిమికొట్టారన్నారు. ఇకపై దేశంలో ప్రతి రాష్ట్రంలోనూ ఇలాగే బుద్ధి చెబుతారని వ్యాఖ్యానించారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

విడిసిఎ కార్యదర్శి ఎంఎల్ఎన్ రాజు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్


శిక్షణలో నేర్చుకున్న నైపుణ్యాలను ఆటలో ప్రదర్శిస్తే ఉత్తమ ఫలితాలు సాధ్యమవుతాయని విజయనగరం జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎంఎల్ఎన్ రాజు అన్నారు. జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్- 16 విభాగంలో బాలబాలికలకు నిర్వహించిన క్రికెట్ శిక్షణ ఆదివారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వేసవి శిక్షణ కార్యక్రమాలతో పిల్లల ఆటల్లో ఏమైనా లోటుపాట్లు ఉంటే మెరుగుపర్చుకోవడానికి, నైపుణ్యాలు పెంపొందించుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. కొద్ది రోజుల్లో నిర్వహించే జిల్లా స్థాయి క్రికెట్ పోటీల్లో నైపుణ్యాలను ప్రదర్శించాలని కోరారు. కార్యక్రమంలో సెలెక్టర్ వర్మరాజు, శిక్షకులు ఎ.చంద్రశేఖర్, చందక రమేష్, మహిళా కోచ్ యమున పాల్గొన్నారు.



క్రీడాకారులతో మాట్లాడుతున్న విడిసిఎ కార్యదర్శి రాజు

వ్యవసాయ ఉత్పత్తుల సేకరణకు పెద్దపీట

- పలుచోట్ల సోలార్ శీతల గిడ్డంగులు • సమీకృత నీటి పారుదల సదుపాయం
- తోటబడి ద్వారా రైతులకు విస్తృత అవగాహన • 50 శాతం మామిడి కోత పూర్తి
- మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు రుణాలు
- 'ప్రజాశక్తి'తో జిల్లా ఉద్యాన శాఖ అధికారి జమదగ్ని ముఖాముఖి



జిల్లాలో వ్యవసాయ ఉత్పత్తుల సేకరణ కేంద్రాల ఏర్పాటుకు పెద్దపీట వేస్తున్నామని జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఎవిఎస్‌వి జమదగ్ని తెలిపారు. పలు చోట్ల శీతల గిడ్డంగులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. చెరువుల ఆధారంగా సమీకృత నీటిపారుదల సదుపాయాన్ని కూడా కల్పిస్తున్నామని చెప్పారు. తోటబడి ద్వారా రైతులకు వివిధ పంటల సాగుపై విస్తృత అవగాహన కల్పిస్తున్నట్టు వివరించారు. ఈ ఏడాది మామిడి దిగుబడి ఆశాజనకంగానే వచ్చిందని, ఇప్పటికే 50శాతం మామిడి కాయల కోత పూర్తయిందని వివరించారు. ఈ వారం తనను కలిసిన ప్రజాశక్తికి ఆయన ముఖాముఖి ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు..

- ప్రజాశక్తి, విజయనగరం ప్రతినిధి

? జిల్లాలో ఏయే ఉద్యాన పంటలు, ఎన్ని ఎకరాల్లో సాగవుతున్నాయి?.

జిల్లాలో అరటి, జీడి, మొక్కజొన్న, బొప్పాయి, మామిడి, ఆయిల్‌పాం తదితర ఉద్యాన పంటలు సుమారు 1,14,197 ఎకరాల్లో సాగవుతున్నాయి. అక్కడక్కడ చింతపండు కూడా సాగవుతోంది. తద్వారా సుమారు 4.47 లక్షల మెట్రిక్ టన్నుల మేర ఉత్పత్తి అవుతుంది. మామిడి సాగులో మన జిల్లా మూడో స్థానంలో ఉంది. 1100 ఎకరాల్లో అరటి పంట సాగవుతోంది.

? వ్యవసాయ ఉత్పత్తుల సేకరణ కేంద్రాలు ఎన్ని ఏర్పాటు చేశారు?.


జిల్లాలో వివిధ ఉద్యాన పంటలు సాగవుతున్నప్పటికీ అవన్నీ ఒకే చోట దొరికే పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలో ఆయా ఉత్పత్తులన్నీ ఒకే చోటకు చేర్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. తద్వారా క్రయ విక్రయాలకు వీలుగా ఉంటుంది. ఇలాంటివి జిల్లా వ్యాప్తంగా 23 వ్యవసాయ ఉత్పత్తి సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టగా ఇప్పటి వరకు 12 వరకు ఏర్పాటు చేశాం. సోలార్ శీతల గిడ్డంగులు కూడా 12 ఏర్పాటు చేసేందుకు నిర్ణయించగా, ఇప్పటి వరకు 9 ఏర్పాటు చేశాం. వీటిని రైతు బృందాలు ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. ఇందుకోసం 75 శాతం రాయితీపై అవసరమైన సామగ్రి, ఉపకరణాలు పంపిణీ చేస్తున్నాం.

? ఉద్యాన పంటలపై రైతుల్లో అవగాహన ఎలా ఉంది?.

వ్యవసాయ శాఖ ఆధ్వర్యాన పొలంబడి కార్యక్రమం నిర్వహించినట్టే.. ఉద్యాన శాఖ ఆధ్వర్యాన తోటబడి కార్యక్రమం చేపడుతున్నాం. ఇందులో సాగులో అధునాతన యాజమాన్య పద్ధతులతోపాటు చీడపీడ పురుగుల దాడి, నివారణ చర్యలు తదితర అంశాలపై రైతులకు వివరిస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 83 చోట్ల రైతు శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేశాం.

? ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు రుణాలు మంజూరు చేస్తున్నారా?.

అవును..! ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఆధ్వర్యాన ప్రధాన మంత్రి ఫార్మలైజ్డ్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ (పిఎంఎఫ్ఎంఇ) పథకం కింద 35 శాతం సబ్సిడీతో రైతులకు వ్యక్తిగత రుణాలు మంజూరు చేస్తోంది. 10 శాతం లబ్ధిదారులు (రైతులు) చెల్లించుకుంటే మిగిలిన 55 శాతం బ్యాంకు రుణంగా మంజూరవుతుంది. రైతులు తాము సాగుచేసే ఉద్యాన ఉత్పత్తుల ఆధారంగా తినుబండారాలు, ఆయిల్ తయారీ వంటి యూనిట్లను వ్యక్తిగతంగా ఏర్పాటు చేసుకోవచ్చు. యూనిట్ విలువను బట్టి దానికి అవసరమయ్యే మిషనరీ కోసం రూ.కోటి వరకు ప్రభుత్వం మంజూరు చేస్తుంది. ఈ పథకం కింద గతేడాది జిల్లా వాప్తంగా రూ.1.30 కోట్ల మేర రైతులకు లబ్ధి చేకూరింది.



? సమీకృత నీటి సదుపాయం అంటే ఏమిటి?.

వివిధ ఉద్యాన పంటల సాగుకు దోహదపడే విధంగా సుమారు 50 చెరువుల నుంచి నీటి సదుపాయం కల్పించేందుకు ప్రయత్నించాం. ఎపి సమీకృత నీటి పారుదల, వ్యవసాయ పరివర్తన పథకం కింద ఈ ఏడాది రూ.40.71 లక్షల ఆర్థిక లక్ష్యానికిగాను ఇప్పటి వరకు రూ.37.69 లక్షలు ఖర్చుచేశాం.

? మామిడి సాగు, దిగుబడి ఎలా ఉంది?.

మామిడి సాగులో జిల్లా మూడో స్థానంలో ఉంది. సువర్ణరేఖ, బంగినపల్లి, నీలాలు, కోలంగోవ వంటి రకాలు ఇతర ప్రాంతాలతో పోలిస్తే ఎంతో రుచిగా ఉంటాయి. అందుకే డిమాండ్ ఎక్కువగా ఉంటోంది. ప్రత్యేకించి ప్రభుత్వం తరపున మామిడి మార్కెట్ లేకపోయినప్పటికీ ఇక్కడి నుంచి దేశంలోని వివిధ ప్రాంతాలకు ఎగుమతి అవుతుంటాయి. దిగుబడి బాగానే ఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు కూడా పెద్దగా నష్టం జరగలేదు.

ఉద్యాన శాఖ ఆధ్వర్యాన పథకాలేమైనా అమలవుతున్నాయా?.

మిషన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ఆఫ్ హార్టికల్చర్ (ఎంఐడిహెచ్), నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్ (ఎన్ఎంఇఒ) తదితర పథకాలు ఉన్నాయి. ఎంఐడిహెచ్ పథకం కింద 2022-23 కోత అనంతర యాజమాన్యం మౌలిక సదుపాయాల కోసం 69 ఎకరాలకు రూ.72.37 లక్షల ఆర్థిక లక్ష్యం తీసుకున్నాం. ఇప్పటి వరకు 106.5 ఎకరాలకు రూ.47.44 లక్షల ఆర్థిక ప్రగతి సాధించాం. ఎన్ఎంఇఒ ఆయిల్ ఫామ్ పథకం కింద 2 వేల ఎకరాల్లో సాగుచేయాలని లక్ష్యం పెట్టుకోగా ఇప్పటి వరకు 967.5 ఎకరాల్లో సాగు జరిగింది.



ఆహ్వాన పత్రికలను విడుదల చేస్తున్న నాయకులు

ఆహ్వాన పత్రికలు విడుదల

నెల్లిమర్ల: ఈ నెల 21న రజక సంఘం నాయకులు కీర్తి శేషులు మలిచర్ల దుర్గారావు సంతాప సభ నిర్వహిస్తామని ఉమ్మడి జిల్లా రజక సంఘం అధ్యక్షులు తంగేటి భాస్కరరావు తెలిపారు. దాసన్నపేటలోని రైతు బజారు సమీపంలో సంతాప సభకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను ఆ సంఘం సభ్యులు ఆదివారం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం సలహాదారులు తాతారావు, జాయింట్ సెక్రెటరీ సింహాచలం, రాము, కమిటీ సభ్యులు రాజు, రమణ, సూరరాజు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి జువ్వాలమ్మ పండగ



వేపాడ : మండలంలోని సింగరాయ గ్రామ దేవత జువ్వాలమ్మ పండగను సోమ, మంగళవారాల్లో నిర్వహించనున్నామని కమిటీ సభ్యులు, సర్పంచ్ నిరుజోగి వెంకటరావు ఆదివారం తెలిపారు. సోమవారం తొలేళ్ళు, మంగళవారం అనుపోత్సవం కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా ఎద్దుల బండ్ల పోటీలు, కోలాటాలు, కాంగో నృత్య ప్రదర్శన, మహిళా కోలాటాలు, పలు సాంస్కృతిక ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

పద్మజకు ఎన్‌టిఆర్ స్మారక అవార్డు



అవార్డు అందుకుంటున్న పద్మజ

బొబ్బిలి: పద్మజ డాన్స్ అకాడమీ నిర్వాహకులు, కూచిపూడి నృత్య కళాకారిణి జి.వాణి పద్మజకు ఎన్‌టిఆర్ స్మారక అవార్డు లభించింది. విశాఖలో ఈనెల 13న జరిగిన ఎన్‌టిఆర్ శత జయంతి ఉత్సవాల్లో తెలుగు సంస్కృతి అకాడమీ చైర్‌పర్సన్ లక్ష్మీపార్వతి సన్మానించి అవార్డు ప్రదానం చేశారు. రియల్ ఎస్టేట్ వ్యాపారి, ఎన్‌టిఆర్ అభిమాని బంటు అర్జున్ చేసిన సామాజిక కార్యక్రమాలకు గుర్తింపుగా ఆయన కూడా ఎన్‌టిఆర్ స్మారక అవార్డు అందజేశారు. అవార్డు రావడం ఎంతో ఆనందంగా ఉందని పద్మజ, బంటు అర్జున్ అన్నారు.

శిరికి గ్రీన్ సిటీని పరిశీలించిన నాయకులు

శృంగవరపుకోట: ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా చంద్రబాబు ఈ నెల 18న శృంగవరపుకోట రానున్న నేపథ్యంలో ఆ రోజు రాత్రి బస చేయనున్న శిరికి గ్రీన్ సిటీని టిడిపి టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల బాలాజీ అప్పల రాంప్రసాద్ ఆదివారం పరిశీలించారు. చంద్రబాబు బస చేయనున్న గది వద్ద సౌకర్యాలను పరిశీలించారు. ఆయన వెంట టిడిపి నాయకులు లాలం అర్జునరావు, కొట్యాడ రమణమూర్తి, మళ్ళా రామకృష్ణ, కోళ్ల భూపాల్ నాయుడు, కొట్టాన విజయ్ కుమార్, అక్కిరెడ్డి వెంకటరమణ తదితరులు ఉన్నారు.




కంట్రీ పరుగులో పాల్గొన్న క్రీడాకారులు

క్రీడాకారుల క్రాస్ కంట్రీ పరుగు

శృంగవరపుకోట: పట్టణంలోని కేంబ్రిడ్జి నారాయణ పాఠశాల క్రీడామైదానంలో గత 9 రోజులుగా ఫ్రెండ్స్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న వేసవి బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరంలో భాగంగా ఆదివారం ఉదయం 6 గంటలకు నారాయణ కేంబ్రిడ్జి పాఠశాల నుండి ఆకులు డిపో వరకు రెండు కిలోమీటర్ల క్రాస్ కంట్రీ పరుగును నిర్వహించారు. ఫ్రెండ్స్ బ్యాడ్మింటన్ అకాడమీ చీఫ్ కోచ్ డాక్టర్ పొట్నూరు శ్రీరాములు ఆధ్వర్యంలో 85 మంది శిక్షణ పొందుతున్న క్రీడాకారులు ఈ పరుగులో పాల్గొన్నారు. చిన్నారి క్రీడాకారులు చేస్తున్న ఈ క్రాస్ కంట్రీ పరుగు చూపరులను ఎంతగానో ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో కోచ్‌లు మహమ్మద్ అస్లాం, కొణతాల సురేష్, బర్నికాన హారిక, పంపాన మౌనిక, చింతల మహాలక్ష్మి, కండుబోతు హేమంత్, మట్ట చరణ్ తేజ, కొమ్మినేని భాను ప్రకాష్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

16న బొబ్బిలిలో ప్రజా ఛార్జిషీట్

బొబ్బిలి : బొబ్బిలిలో ఈ నెల 16న ప్రజా ఛార్జ్ షీట్ నిర్వహిస్తామని బిజెపి జిల్లా అధ్యక్షులు రెడ్డి పావని, నియోజకవర్గ నాయకులు మరిశర్ల రామారావునాయుడు తెలిపారు. సాహితీ నగర్ బిజెపి కార్యాలయంలో ఆదివారం వారు విలేకర్లతో మాట్లాడుతూ బిజెపి రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా ప్రజా ఛార్జ్ షీట్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యేలు, వైసిపి నాయకులు చేస్తున్న అక్రమాలు, భూకబ్జాలు, అవినీతిపై ప్రజా ఛార్జ్ షీట్ నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు పాల్గొంటారని చెప్పారు. ఈ సమావేశంలో బిజెపి రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యులు టి.హరి, జిల్లా కార్యదర్శి పి.మనోజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



క్లినిక్‌ను ప్రారంబిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రావణి

సంతాన సాఫల్య క్లినిక్ ప్రారంభం

విజయనగరం : నగరంలోని మఠం వీధి వద్ద సంతాన సాఫల్య క్లినిక్‌ను డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విజయనగరంలో ఇటువంటి క్లినిక్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిన లండన్ సంతాన సాఫల్య కేంద్ర డైరెక్టర్ కె. చంద్రారెడ్డికి అభినంద నలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ చంద్రారెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే విశాఖ, రాజమండ్రి, కాకినాడ ప్రాంతాల్లో తమ సంతాన సాఫల్య కేంద్రాలున్నాయన్నారు. తక్కువ ధరకే నాణ్యమైన చికిత్సలు అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమం లో వైద్యులు డాక్టర్ బివి రవిచంద్ర, సన్యాసమ్మ, ఎం. సుధాకుమారి, విద్యావతి, పాల్గొన్నారు.

వినియోగంలోకి మహిళా పార్కు

విజయనగరం టౌన్: నగరంలో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన మహిళా పార్కును ఆదివారం నుంచి పూర్తిస్థాయిలో మహిళలకు అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి ప్రకటించారు. ఆదివారం సాయంత్రం మహిళా పార్కు చుట్టూ కలియతిరిగి, స్వచ్ఛంద సంస్థల మహిళా ప్రతినిధులకు పార్కులో ఉన్న వివరాలను వారు వివరించారు. స్విమ్మింగ్ పూల్‌ను పరిశీలించారు. అనంతరం మీడియాతో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో తొలి మహిళా పార్కుగా ప్రకాశం పార్కును డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి తీర్చిదిద్దారని కొనియా డారు. మహిళా పార్కు ప్రతిరోజూ ఉదయం 5 నుంచి 9 వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 9 గంటల వరకు తెరిచి ఉంటుందని చెప్పారు. ఐదేళ్లలోపు పిల్లలకూ ప్రవేశం కల్పిస్తున్నట్లు తెలిపారు. కేవలం మహిళలు మాత్రమే పార్కులోకి ప్రవేశించే విధంగా ఏర్పాట్లు చేశామన్నారు. స్విమ్మింగ్ పూల్ నిర్వహణ కోసం నిష్ణాతులైన వారిని ఎంపిక చేసినట్లు తెలిపారు.

తరలింపు సాధ్యమేనా..?


- ఒక్కొక్కటిగా మృత్యువాత పడుతున్న ఏనుగులు
- ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యంపై సర్వత్రా విమర్శలు
- తమ గ్రామాల నుంచి తరలించాలని వేడుకోలు

ప్రజాశక్తి - కొమరాడ

ఏనుగుల గుంపును జిల్లా నుంచి శాశ్వతంగా అటవీ ప్రాంతానికైనా, జూకైనా తరలించడం ప్రభుత్వానికి సాధ్యమేనేనని జిల్లా ప్రజల నుంచి విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఏడేళ్ల క్రితం జిల్లాలోకి ప్రవేశించిన ఏనుగుల గుంపును తరలించేందుకు ప్రభుత్వాలు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో ఈ ప్రాంత రైతులు, ప్రజలు భయాందోళనతో బిక్కుబిక్కుమంటూ జీవించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఏనుగుల తరలింపు మాట పక్కన పెడితే కనీసం ఏనుగులను రక్షించుకునే పరిస్థితిలో కూడా అధికారులు లేరనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. అధికారుల నిర్లక్ష్యం వల్ల ఇప్పటి వరకూ 11 ఏనుగులు మృత్యువాత పడ్డాయి.

జిల్లాలోకి ఏనుగుల గుంపు రావడం కొత్తేమీ కాదు. దశాబ్ద కాలంగా పార్వతీపురం మన్యం ప్రాంతంలో ఏదు ఏనుగుల గుంపు సంచరిస్తూ పలువుర్ని బలితీసుకోగా, కోట్లాది రూపాయల పంట నష్టం కూడా వాటిల్లింది. మరి కొన్ని సందర్భాల్లో ప్రమాదవశాత్తు ఏనుగులు కూడా మృతి చెందుతున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుంది. విద్యుత్ శాఖతో మన్యం జిల్లా భామిని మండలం కాట్రగడ్డ వద్ద ఇటీవల నాలుగు ఏనుగులు ఒకేసారి మృతి చెందిన ఘటన జిల్లాలోని తీవ్ర కలకలం సృష్టించాయి. గతంలోనూ ఏనుగులు విద్యుత్ షాక్‌తో పాటు వివిధ ప్రమాదాల బారిన పడి మృత్యువాత పడ్డాయి. అటవీ ప్రాంతం నుంచి వచ్చిన ఏనుగులు మైదాన ప్రాంతాల్లో తిరుగుతూ మృత్యువాతపడుతున్నాయి తప్ప తరలింపునకు మాత్రం చర్యలు చేపట్టడం లేదు.

ఇప్పటికే ఏనుగుల బారిన పడి 11మంది వరకు మృత్యువాతపడినట్లు అధికారులు లెక్కలు చెబుతున్నాయి. ఏనుగుల సంచారంతోనే వేల ఎకరాల పంటలకు నష్టం జరిగాయి. పదుల సంఖ్యల్లో మూగజీవాలు ఏనుగుల దాడిలో మృతి చెంది రైతులను ఆర్థికంగా నష్టపర్చాయి.



వరి పంటలో కలియ తిరుగుతున్న ఏనుగుల గుంపు (ఫైల్)

ఏనుగుల తరలింపు ప్రక్రియ పక్కన పెడితే నష్టపోయిన పంటలకు పరిహారం చెల్లించడంలోనూ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

2007లో అప్పటి శ్రీకాకుళం జిల్లాలోకి విజయనగరం జిల్లా మీదుగా తొమ్మిది ఏనుగులు ప్రవేశించాయి. ఇవి పొరుగునే ఉన్న ఒడిశాలోని లఖేరి అటవీ ప్రాంతం నుంచి తొలిసారి సీతంపేట మండలంలోకి ప్రవేశించాయి. 2017లో మరో ఎనిమిది ఏనుగుల గుంపు ఒడిశా నుంచి పార్వతీపురం మన్యం జిల్లాలోకి ప్రవేశించాయి. తాజాగా ఆరు నెలల క్రితం మరో ఏనుగుల గుంపు సీతంపేట మండలంలోకి ప్రవేశించాయి. పార్వతీపురం మన్యం జిల్లాలో మూడు ఏనుగుల గుంపులు సంచరిస్తున్నాయి. 2018 ఏడాదిలో ఎనిమిది ఏనుగుల గుంపులో ఒక ఏనుగు విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. మరో ఏనుగు తోటపల్లి జలాశయం ముంపు ప్రాంతంలో మునిగిపోయి ఊపిరాడక చనిపోయింది. మన్యం జిల్లాలోకి ప్రవేశించిన మూడు ఏనుగుల గుంపుల్లో ఇప్పటి వరకు 11 ఏనుగులు ప్రమాదవశాత్తు మృతి చెందాయి. 11 ఏనుగులు మృతిపై అధికారులు, ప్రభుత్వం నిర్లక్ష్యమే కారణమని సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఏది ఏమైనా ఏనుగుల మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా ఏనుగులను శాశ్వతంగా అటవీ ప్రాంతానికి తరలించకపోతే భవిష్యత్తులో ఉన్న ఏనుగులు కూడా మృతి చెందే పరిస్థితి ఉందని చెబుతున్నారు. పగటిపూట ఎలిఫెంట్ ట్రాకర్లు ఏనుగుల వెనకాల కాపుల కాస్తున్నప్పటికీ రాత్రి సమయంలో వాటి జాడను ట్రాకర్లు కనిపెట్టలేకపోతున్నారు. అదే సమయంలో ఏనుగులు గుంపు ప్రమాదవశాత్తు మృతి చెందుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తక్షణమే ఏనుగుల తరలింపునకు చర్యలు చేపట్టకపోతే భవిష్యత్తులో ఉన్న ఏనుగులు ప్రమాదవశాత్తు మృతి చెందే అవకాశం స్పష్టంగా కనిపిస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

రైతు దగాకోరు చంద్రబాబే: ఎంపిపి

ప్రజాశక్తి- రామభద్రపురం

అధికారంలో ఉన్నన్నాళ్ళు రైతులను, ప్రజలను, గ్రామీణ ప్రాంతాలను దగా చేసిన దగాకోరు చంద్రబాబేనని ఎంపిపి చొక్కాపు లక్ష్మణరావు విమర్శించారు. స్థానిక వైసిపి కార్యాలయంలో ఆదివారం జెడ్‌పిటిసి అప్పికొండ సరస్వతమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతు రుణమాఫీ చేస్తానని అధికారం దక్కించుకొని ఒకేసారి మాఫీ చేయకుండా చేతులు దులుపుకున్నారని ఎద్దేవా చేశారు. జగనన్న రైతు శ్రేయస్సుకై నిరంతరం శ్రమిస్తూ పారదర్శక సేవలు అందిస్తూ రైతు సేవలో ముందంజలో ఉన్నారన్నారు. టిడిపి నేతలు చేస్తున్న విమర్శలు అర్థరహితమని వారి హయాంలో జరిగిన అభివృద్ధి, ప్రస్తుత జగనన్న ప్రభుత్వంలో గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పై చర్చకు సిద్ధమా అని సవాల్ చేశారు. అన్ని గ్రామాల్లో పార్టీలకు అతీతంగా ప్రభుత్వం చేస్తున్న నవరత్నాల అమలుతో సుపరిపాలన అందుతుందని ప్రజలంతా సంతృప్తితో మెరుగైన జీవన భృతులు పొందుతున్నారని చెప్పారు. మొక్కజొన్న కొనుగోలుకు యంత్రాంగం సిద్ధంగా ఉందని చెప్పారు. రైతులు ఆరబికెలను సంప్రదించి తమ వద్ద ఉన్న మొక్క జొన్నను ప్రభుత్వం నిర్ణయించిన ధరకు అమ్ముకోవచ్చునన్నారు ఈ సమావేశంలో జెసిఎస్ కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రాయల్, పార్టీ నాయకులు కనిమెరక అప్పారావు, డర్రు పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాతృ దినోత్సవం

ప్రజాశక్తి - జామి

పిల్లల కోసం తన జీవితాన్ని దారపోసి పిల్లలే తన జీవిత మని, ప్రపంచమని బ్రతికే మహోన్నత వ్యక్తి సృష్టిలో అమ్మ మాత్రమేనని అందుకే అమ్మని మించి దేవతలు ఇలలో ఉండరని లోక్ సత్తాపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి అన్నారు. మాతృ దినోత్సవం సందర్భంగా మండలంలోని అట్టాడ బిఎన్‌ఆర్ ఆశ్రమంలో జరిగిన వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ముందుగా ఆశ్రమంలోని వృద్ధులతో కేక్ కట్ చేయించి మాతృ దినోత్సవం గురించి వివరించారు తన కష్టాలను తన కళ్ళల్లోనే దాచేస్తూ పైకి చిరునవ్వులు చిందించే అమ్మకోసం ఎంత చెప్పినా తక్కువే అవుతుందని, బిడ్డ ఏడిస్తే తను తల్లడిల్లిపోయి బిడ్డ నవ్వితే తాను మురిసిపోయి, ఆర్థిక, శారీరక, మానసిక ఇబ్బందులు కుటుంబంలో ఎదురైన కన్న పేగుకి మాత్రం కష్టం రానివ్వకుండా కంటికి రెప్పలా కాపాడుకునే మహా తల్లి అమ్మ మాత్రమే అని అన్నారు. సమాజం నిర్మాణంలో అమ్మ పాత్ర అనిర్వచనీయమైనదని అటువంటి అమ్మకు జీవితాంతం విధేయులుగా ఉండాల్సిందేనన్నారు. అనంతరం వృద్ధులకు బోజనాలను పెట్టారు.

నెల్లిమర్ల: మదర్స్ డే సందర్భంగా చిన్నారులు సృష్టిలో ప్రథమ దైవమైన మాతృ మూర్తికి పాద పూజ చేసి ఆదివారం ఆశీస్సులు పొందారు. ప్రతి ఒక్క పిల్లలు వారి తల్లులకు పాదాభివందనం చేయాలని తద్వారా మాతృమూర్తి ఆశీస్సులతో పాటు భగవంతుడు ఆశీస్సులు ఉంటాయని తల్లిదండ్రులు తెలిపారు.

ఎమ్మెల్సీకి 104 సిబ్బంది వినతి

ప్రజాశక్తి- శృంగవరపుకోట

మండలంలోని 104 ఉద్యోగులు తమ జీత భత్యాలు, సేవలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని 104 ఉద్యోగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కోటారావు అధ్యక్షతన ఉద్యోగులు ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజుకి ఆదివారం బొడ్డవరలో వినతిపత్రం అందజేసారు. ఈ సందర్భంగా కోటారావు మాట్లాడుతూ 104 ఉద్యోగులుగా ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం ద్వారా పేద ప్రజలకు సేవలు అందిస్తున్న ఉద్యోగులకు సకాలంలో జీతాలు ఇప్పించాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, 2020 కరోనా కాలం నుంచి సుదూర ప్రాంతాలలో పని చేస్తున్న ఉద్యోగులకు, కొత్త 104 వాహనం సేవకు బదిలీలు కల్పించాలని కోరారు. ఉద్యోగులకు అరబిందో కంపెనీ యాజమాన్యం చెల్లించవలసిన ప్రావిడెంట్ ఫండ్ వాటా యాజమాన్యం వారే చెల్లించే విధంగా, ఐదు నుండి పది సంవత్సరాలు పూర్తయిన సీనియర్ డ్రైవర్లకి స్లాబ్ సిస్టం, జాయినింగ్ ఆర్డర్‌లో ప్రతి ఆరు నెలలకి జీతాలు పెంచుతామని చెప్పిన విధంగా పెంచి తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్సీ వారి సమస్యలను జిల్లా ఉన్నతాధికారులకు, రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 104 సిబ్బంది రవీంద్రుడు, రమేష్, సత్యనారాయణ, నాయుడు, మహాలక్ష్మి, తులసి పాల్గొన్నారు.



ఎమ్మెల్సీకు వినతి పత్రాన్ని అందిస్తున్న 104 ఉద్యోగులు

పాదయాత్రను విజయవంతం చేయండి

ప్రజాశక్తి- గజపతినగరం :

గజపతినగరం పార్టీ కార్యాలయం నుండి బొండపల్లి వరకు సోమవారం చెయ్యబోయే పాదయాత్రను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే కెఎ నాయుడు అన్నారు. ఆదివారం ఆయన టిడిపి కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర 100వ రోజుకు చేరుకున్న సందర్భంగా యువగళం- ప్రజాగళం అనే నినాదంతో నేడు పాదయాత్ర చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, యువత, మహిళలు, రైతులు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వేపాడ : నారా లోకేష్ ప్రారంభించిన యువగళం పాదయాత్ర సోమవారం నాటికి వంద రోజులు పూర్తి కావడంతో కొత్తవలస మండలం చింతలపాలెం దిమ్మ నుంచి మండల కేంద్రంలోని నాలుగు రోడ్ల జంక్షన్ వరకూ పాదయాత్ర నిర్వహిస్తున్నామని టిడిపి మండల ఉపాధ్యక్షుడు పివి రమణ తెలిపారు. మండల కేంద్రంలో ఆయన సోమవారం కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ పాదయాత్రలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలన్నారు. ఈ సమావేశంలో టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కెవి రమణమూర్తి, టిడిపి ఎస్‌టి సెల్ ఉపాధ్యక్షులు, మాజీ ఎంపిపి దాసరి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: స్థానిక రామతీర్థం కూడలి నుంచి రామతీర్థం దేవాలయం వరకూ సోమవారం నిర్వహించనున్న పాదయాత్రను ప్రతి ఒక్కరూ జయప్రదం చేయాలని టిడిపి మండల అధ్యక్షులు కడగల ఆనంద్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. లోకేష్ యువగళం ప్రారంభించి 100 రోజులు పూర్తవుతున్న సందర్భంగా తామంతా ఇక్కడ పాదయాత్ర చేసి సంఘీభావం తెలుపుతామని ఆయన స్పష్టం చేశారు.

జరజాపుపేటలో మెగా రక్తదాన శిబిరం

ప్రజాశక్తి- నెల్లిమర్ల

నగరపంచాయతీ పరిధిలోని జరజాపుపేటకు చెందిన జూనియర్ లైన్‌మేన్ మద్దిల శివ జ్ఞాపకార్థం గ్రామంలో ఆదివారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. 2010-11 పదో తరగతి పూర్వ విద్యార్థులు, రైజింగ్ స్టార్స్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరాన్ని ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు ప్రారంభించారు. దీనికి ముందు శివ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ ఈసి మెంబర్ పోలుబోతు దుర్గాప్రసాద్, పి ఆర్ఓ ముడిదాపు రాము, వైద్య సిబ్బంది పాల్గొని రక్త సేకరణ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన రైజింగ్ స్టార్స్ యూత్ సభ్యులను, వారికి సహకరించిన సాధన యువజన సంఘం సభ్యులను ఎమ్మెల్సీ సురేష్ బాబు అభినందించారు. కాగా శిబిరంలో రైజింగ్ స్టార్స్ యూత్ 65మంది రక్తదానం చేసి శివకి రక్తదానంతో శ్రద్ధాంజలి ఘటించారు. నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, గరివిడి ఎంఇఒ పోలుబోతు రామారావు, నాగవంశం డైరెక్టర్ మద్దిల వాసు, వైసిపి నాయకులు సుదర్శన్ బాబు, కౌన్సిలర్స్ అవనాపు సత్యనారాయణ, నాయకులు తుమ్ము నారాయణమూర్తి, నల్లి శ్రీను, పోలుభోతు నారాయణమూర్తి, ఎంఎం నాయుడు, మద్దిల శ్రీనివాసరావు, అవనాపు మురళీకృష్ణ, మద్దిల రాజారావు, పోస్ట్ మాస్టర్ పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ సురేష్‌బాబు

కోల్డ్ స్టోరేజ్ స్థలం ఆక్రమణ

ప్రజాశక్తి - లక్కవరపుకోట

మండలం లోని కొట్యాడలో కోల్డ్ స్టోరేజ్ కోసం కేటాయించిన భూమి ఆక్రమణకు గురవుతుంది. ఆక్రమణదారులు రహస్యంగా ఆదివారం గృహ నిర్మాణ పనులు చేపట్టారు. ఇందుకు సంబంధించి గ్రామ సర్పంచ్ భర్త దేవి మహేష్, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం జగనన్న లేఔట్ సమీపంలో ప్రాథమిక హెల్త్ సెంటర్ వెనుక భాగాన పాల కోల్డ్ స్టోరేజ్‌కు కేటాయించిన భూమి ఆక్రమణకు గురవుతున్నట్లు తెలిపారు. కొట్యాడ గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉద్యోగి ఈ ఆక్రమణలకు పాల్పడుతున్నట్లు వివరించారు. జగనన్న మిల్క్ బల్క్ సెంటర్ కోసం ఇక్కడ నిర్మించేందుకు ఇప్పటికే జియో టాకింగ్ అయిందని తెలిపారు. రెవెన్యూ కార్యాలయం సెలవు దినాలలో ఈ తరహా ఆక్రమణలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఈ విషయంపై స్థానిక తహశీల్దార్ తామరాపల్లి రామకృష్ణకు ఫోన్ ద్వారా 'ప్రజాశక్తి' వివరించగా నిర్మాణ పనులు నిలుపుదల కోసం వీఆర్వో ను పంపనున్నట్లు తెలిపారు.



అక్రమ నిర్మాణాలు చేపడుతున్న కబ్జాదారులు

ఘనంగా హనుమాన్ జయంతి

ప్రజాశక్తి- బాడంగి

మండలంలోని ఎరుకుల పాకలు గ్రామంలో ఆదివారం హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా శ్రీఅభయాంజనేయ స్వామి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గజరాయునివలస ఎంపిటిసి, రాష్ట్ర టిడిపి ఎస్‌టి సెల్ జనరల్ సెక్రటరీ పాలవలస గౌరు, లక్ష్మీపురం సర్పంచ్ పాలవలస పార్వతమ్మ, ఎరుకులపాకలు ప్రజలు పాల్గొన్నారు.

బొబ్బిలి: పట్టణంలో ఆదివారం హనుమాన్ జయంతి ఘనంగా జరిగింది. పార్కు గట్టుపై ఉన్న అభయాంజనేయ స్వామి ఆలయంలో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, ఆలయ కమిటీ చైర్మన్ రెడ్డి సత్యం, కమిటీ సభ్యులు హనుమాన్ జయంతి నిర్వహించి పూజలు చేశారు. దేశతల్లి ఆలయం సమీపంలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో టిడిపి నియోజకవర్గ ఇంచార్జి బేబినాయన పూజలు చేశారు. హనుమాన్ జయంతి సందర్భంగా అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట: పట్టణంలోని బ్రాహ్మణ వీధిలో ఉన్న కోదండ రామాలయంలో హనుమాన్ జయంతిని పురస్కరించుకొని ఆదివారం ఉదయం 6 గంటలకు పంచరత్న ఆంజనేయ విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని కన్నుల పండుగ నిర్వహించారు. ఆలయ ధర్మకర్త హనుమాల శెట్టి సాధు ఆలయ అర్చకులు వేదుల రవి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. విగ్రహ దాతలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధనను నిర్వహించారు.మండలంలోని మూలబొడ్డవర పంచాయతీ భవానీ నగర్ గ్రామంలో హనుమాన్ జయంతి సందర్భంగా రాపేటి వెంకటరమణ ఆధ్వర్యంలో హనుమాన్ విగ్రహానికి ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆంజనేయ స్వామివారిని దర్శించుకునేందుకు చుట్టు ప్రక్కల గ్రామాల నుండి ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యారు..



డెంకాడ: ప్రత్యేక పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే దంపతులు

వేపాడ : మండల కేంద్రమైన వల్లంపూడి, వేపాడ గ్రామాలతో పాటు మండల పరిధిలోగల పలు గ్రామాలలో శ్రీ ఆంజనేయ స్వామి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పలు చోట్ల అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు.

నెల్లిమర్ల: స్థానిక్ల నగర పంచాయతీలో జూట్ మిల్లి వద్ద ఉన్న హనుమాన్ ఆలయంలో తెల్లవారు జాము నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. హనుమాన్ ఆటో మెకానిక్ ఓనర్ డి. భాష సంతోషి దంపతులు పులిహార ప్రసాదం, వాటర్ ప్యాకెట్లు ఇతర భక్తులు మజ్జిగ భక్తులకు అందజేశారు.

విజయనగరం టౌన్ : హనుమజ్జయంతి సందర్భంగా ఆదివారం పంచముఖాంజనేయ స్వామి దేవాలయంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. సిటీ బస్టాండ్, బుచ్చన్న కోనేరు, కణపాకలో జరిగిన హనుమాన్ జయంతి వేడుకల్లో వైసిపి యువజన విభాగం జోనల్ ఇన్‌ఛార్జి అవనాపు విక్రమ్ పాల్గొన్నారు.

డెంకాడ: హనుమాన్ జయంతి సందర్భంగా విజయనరగరంలోని అయ్యకోనేరు దగ్గర ఉన్న అభయాంజనేయ స్వామిని నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ఆదివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేసి ఆశీర్వచనం అందించారు.

మొక్కలు నాటడం సంప్రదాయం

వేపాడ: మొక్కలు నాటడం సాంప్రదాయంగా కొనసాగిస్తున్నామని గ్రీన్ ఎర్త్ ఆర్గనైజేషన్ (జియో) స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు బి. రామకృష్ణ అన్నారు. మండలంలోని బానాది పరదేశమ్మ గుడి ఆవరణలో 15 కొబ్బరి మొక్కలను ఆయన ఆదివారం నాటారు. కొండగుళ్ళు ఆలయానికి పది, జగ్గయ్య పేట చెరువు చుట్టూ నాటేందుకు 55 కొబ్బరి మొక్కలను కేటాయించామన్నారు. హైదరాబాద్‌కు చెందిన గెంటేల యుగంధర్ కళ్యాణి దంపతుల 53వ పెళ్ళి రోజు సందర్భంగా వారి కుమారుడు కేశవ్ సహకారంతో ఎనబై కొబ్బరి మొక్కలను నాటే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. సిమ్ సంస్థ డైరెక్టర్ వై. విజయ లక్ష్మి, జియో సహ కార్యదర్శి లొంగేది హరిబాబు, ఆలయం కమిటీ సభ్యులు గుమ్మడి శ్రీనివాసరావు, సత్యం, శివం, గణేష్, దేముడు, సాగర్, తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న సంస్థ ప్రతినిధులు

చిత్రలేఖనం పోటీలు

కొత్తవలస: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఆదివారం విద్యార్థు లకు చిత్రలేఖనం పోటీలను నిర్వహిం చారు. ఈ సందర్భంగా గ్రంథాలయా ధికారి ఎం. రామలక్ష్మి మాట్లాడుతూ ఈ శిబిరం విద్యార్థులకు ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. విద్యా ర్థులు అన్ని రంగాల్లో రాణించినట్లయితే విద్యలో మంచి ఫలితాలు సాధించవచ్చుని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పి. నవదీప్, తేజ, ఉదయ్, యోగిత, హర్ష యోగి పాల్గొన్నారు.



వారు గీసిన బొమ్మలతో విద్యార్థులు

వివాహిత ఆత్మహత్య

లక్కవరపుకోట : మండలంలోని మార్లాపల్లి గ్రామానికి చెందిన వివాహిత లెక్కల రమ(35) ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం వెలుగు చూసింది. ఇందుకు సంబంధించి పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మార్లాపల్లి గ్రామానికి చెందిన లెక్కల రమ భర్త చిన్నంనాయుడు ఉద్యోగ రీత్యా విశాఖలో ఓ వైద్యుని వద్ద కారు డ్రైవర్‌గా పని చేస్తున్నారు. వీరికి వివాహమై ఏడేళ్లు గడిచింది. శనివారం రాత్రి రమ తన కుమారుడు, కుమార్తెలను తన చెల్లెలుకు అప్పగించి తలనొప్పిగా ఉందంటూ ఇంట్లోకి వెళ్లి పడుకుంది. తెల్లారేసరికి ఫ్యాన్‌కి వేలాడుతూ విగతజీవిగా కనిపించింది. మృతురాలి తల్లి గనివాడ రామకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతురాలికి సవపంచనామా చేసి పోస్టుమార్టం నిమిత్తం ఎస్‌కోట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎందుకు ఆత్మహత్య చేసుకుందో తెలియరాలేదని ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని స్థానిక ఎస్ఐ ఎం. ముకుందరావు తెలిపారు.

ప్రకాశ్‌రావు మాస్టర్ మృతి

రామభద్రపురం: ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, గ్రామాల్లో సుమారు 130 గాంధీజీ విగ్రహాలు ప్రతిష్టించిన కొట్టక్కి గ్రామానికి చెందిన పివిఎస్ ప్రకాష్‌రావు మాస్టర్ (82) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. ఎన్నో వేల మందికి చక్కని విద్యా బోధన చేసి ఉత్తమ పౌరులుగా తీర్చి దిద్దిన ఘనత ఈయనకే దక్కుతుంది. స్వాతంత్ర సమరయోధుల విజయ గాథలు నిరంతరం విద్యార్థులకు బోధిస్తూ గుర్తింపు పొందారు. ఈయన మృతి పట్ల గ్రామస్తులు, వైసిపి మహిళా నేత అప్పికొండ నిర్మల విచారం వ్యక్తం చేశారు.